

## వేములవాడలో అనుమతులు లేని పాఠశాలలపై దాడులు

**శెనార్తి మీడియా, వేములవాడ:**

వేములవాడ పట్టణంలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు.గతంలో ఎన్నోసార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందన లేకపోవడంతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. జిల్లా ఇంచార్జ్ విద్యాధికారి వినోద్ కుమార్ నేతృత్వంలో అధికారులు పాఠశాలలను పరిశీలించేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యాలు అధికారులను అడ్డుకుని వాగ్వాదానికి దిగాయి. అనుమతుల కోసం ఎన్నోసార్లు దరఖాస్తు చేసినా సంబంధిత శాఖల నుంచి స్పందన రాకపోవడంతోనే పాఠశాలలు యథావిధిగా కొనసాగిస్తున్నామని యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశాయి. “24 గంటల్లోపు అనుమతిపత్రాలు సమర్పించకపోతే పాఠశాలలను సీజ్ చేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటాం” అని డీఈవో వినోద్ కుమార్ హెచ్చరించారు. విద్యా రంగంలో పారదర్శకత, నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దాడుల్లో మండల విద్యాధికారి బన్నజీ, టౌన్ ప్లానింగ్ అధికారి అభినవ్, పట్టణ సీఆర్పీలు శ్రీనివాస్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ వైద్యుల పై మెడికల్ కౌన్సిల్ దాడులు

- కేశవపట్నం, హుజూరాబాద్‌లో ఆకస్మిక తనిఖీలు




**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కరీంనగర్ జిల్లా కేశవపట్నం, హుజూరాబాద్ మండలాల్లో అర్హతలేమితో వైద్యం చేస్తున్న నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. టీజీఎంసీ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్ యగ్గన్న నేతృత్వంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో అనేక అబద్ధపు వైద్య ప్రకటనలు, అక్రమ చర్యలు వెలుగులోకి వచ్చాయి.గతంలో కాంపౌండర్లుగా పనిచేసిన కొందరు వ్యక్తులు ఎలాంటి వైద్య అర్హతలు లేకపోయినా, అనుమతులు లేకుండా వైద్యం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టుతున్నారు. అల్లోపతి మందులు, స్టెరాయిడ్లు, యాంటీబయోటిక్స్, నొప్పి నివారణ ఇంజెక్షన్లు ఇవ్వడం వంటి చర్యలు చాలాచోట్ల కనిపించాయి. ఫస్ట్ ఎయిడ్ పేరుతో క్లినిక్‌లు నడుపుతూ వైద్యం చేస్తున్నారని బృందం గుర్తించింది. తనిఖీల్లో "సంధ్య క్లినిక్", "ఆరాధ్య ప్రథమ చికిత్సా నిలయం"తోపాటు పేరులేని మరో దవాఖానను పరిశీలించారు. వీటిలో కొన్ని రెండుమూడు పడకలతో పనిచేస్తుండగా, రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్నట్లు తేలింది. అక్కడ వైద్యుల ప్రిస్కిప్షన్‌లు లేకుండా మందులు ఇవ్వడం, క్లినిక్ ఎదురుగా ఉన్న మెడికల్ షాపుల్లో అదే పేర్లతో మందులు విక్రయించడం అధికారులు గుర్తించారు.నేషనల్ మెడికల్ కమిషన్ చట్టం ప్రకారం ఎంబీబీఎస్ చేసినవారే మెడికల్ కౌన్సిల్‌లో నమోదు చేసుకొని అల్లోపతి వైద్యం చేయవచ్చు. ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరుతో అల్లోపతి వైద్యం చేసే అధికారం ఎక్కడా లేదని, ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని అధికారులు తెలిపారు. ఇలాంటి చర్యలు నేరంగా పరిగణించబడతాయని, ఏడాది జైలు శిక్ష లేదా ఐదు లక్షల వరకు జరిమానా విధించే అవకాశముందని వివరించారు.తనిఖీల్లో మెడికల్ షాపుల పరిస్థితి కూడా వెలుగులోకి వచ్చింది. చాలాచోట్ల ఫార్మసిస్ట్ లైసెన్స్ ఉన్నా, వాస్తవంగా అర్హులైన ఫార్మసిస్టులు లేని పరిస్థితి ఉందని, ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్నారని అధికారుల వెల్లడించారు. ప్రజల ఆరోగ్యానికి ఇది తీవ్రమైన ప్రమాదమని, ఈ షాపులపై డ్రగ్ కంట్రోల్ శాఖకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.వైద్యం పేరుతో మోసం చేసే నకిలీ వైద్యులను బహిర్గతం చేయడంలో టీజీఎంసీ కట్టుబడి ఉందని, ఇలాంటి చర్యలను BNS చట్టంలోని సెక్షన్ 318 ప్రకారం చీటింగ్ కేసుగా పరిగణించి చర్యలు తీసుకుంటామని డాక్టర్ శ్రీనివాస్ యగ్గన్న స్పష్టం చేశారు.నకిలీ వైద్యుల సమాచారాన్ని అందించినవారి గోప్యతను కాపాడుతామని, ఎవరైనా తక్షణమే anti-quackerytsmc@onlinetsmc.in కు ఈమెయిల్ చేయాలని లేదా వాట్సాప్ నెంబర్ 91543 82727 కు పంపించాలని కోరారు.



## తల్లిదండ్రులను చంపుతామంటున్న కొడుకు

**శెనార్తి మీడియా, జగిత్యాల :**



మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన సురకంటి భూమారెడ్డి- లక్ష్మీ వృద్ధ తల్లిదండ్రులను కొడుకు లింగారెడ్డి, కోడలు పుష్పలత, మనుమడు రంజిత్ చంపుతామని బెదిరింపులకు గురిచేస్తున్నారని మంగళవారం జిల్లా ఎస్పీకి, సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా సంఘానికి ఫిర్యాదు చేశారు. ఆ వినతిపత్రాల్లో తమ పేరు మీదున్న భూములను వారి పేరు మీద మార్చాలని, రైతు బంధు డబ్బులు వారికే ఇవ్వాలని తరచుగా కొట్టుతూ, చంపుతామని బెదిరింపులు చేస్తున్నందున తగు చర్యలు తీసుకోవాలని కోరారు





### మోదీ కానుకగా 20 వేల సైకిళ్ల పంపిణీకి

# బండి సంజయ్ శ్రీకారం

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

**కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోకి టెన్త్ విద్యార్థులకు అందజేత**



కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని టెన్త్ తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీకి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు రవాణా సమస్యల నుండి ఉపశమనం కలిగించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తం 20 వేల సైకిళ్లను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినీ, విద్యార్థులకు అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ కానుకగా నామకరణం చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుంది. తొలిరోజు కరీంనగర్ టౌన్ పరిధిలోని విద్యార్థులకు బండి సంజయ్ స్వయంగా సైకిళ్లను అందజేయనున్నారు. కార్యక్రమానికి కలెక్టర్ పమేల సత్పతి, నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, జిల్లా విద్యాశాఖ అధికారులు హాజరుకానున్నారు. సైకిళ్ల పంపిణీ బాధ్యతను కలెక్టర్‌కు అప్పగించారు. డీఈఓ, ఎంఈవోలు సమర్పించిన జాబితా ఆధారంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా, మండలాల వారీగా పంపిణీ చేపడతారు. నెలరోజుల్లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**విద్యార్థుల రవాణా సమస్యలపై దృష్టి**

పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆటోలు, బస్సులు లేనందున స్కూళ్లకు వెళ్లే విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా టెన్త్ తరగతిలో చదువుతున్న విద్యార్థులకు తరగతులు ముగిసిన తర్వాత ప్రత్యేక తరగతులుండటంతో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ దృష్టితో బండి సంజయ్ సీఎస్సార్ నిధులను వినియోగించి 20 వేల బ్రాండెడ్ సైకిళ్లను కొనుగోలు చేశారు.

**సేవా కార్యక్రమాల పట్ల అంకితభావం**

ఏటా పుట్టినరోజు సందర్భం గా విస్తృత సేవా కార్యక్రమాలు చేపడుతున్న బండి, ఈసారి విద్యార్థుల రవాణా సమస్యల పరిష్కారానికి సైకిళ్ల పంపిణీకి పూనుకున్నారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రులకు మెడిసిన్లు, ఫ్రీజర్లు, అంబులెన్స్‌లు, మెడికల్ పరికరాలు అందజేసిన ఆయన, ఇటీవల వేములవాడ, హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్ ఆసుపత్రులకు రూ.5 కోట్ల విలువైన ఆధునిక పరికరాలను అందించారు.

**విద్యా, వైద్య రంగాలపైనే ఫోకస్**

బండి సంజయ్ గతంలో ‘సంజయ్ సురక్షా’ పేరుతో అంబులెన్స్‌లు అందించిన సంగతి తెలిసిందే. అలాగే కరోనా సమయంలో రోగులకు ప్రత్యక్షంగా వెళ్లి మెడిసిన్లు, ఇంజక్షన్లు, గ్లౌజులు అందించి భరోసానిచ్చారు. ప్రజల అవసరాలకే తన పుట్టినరోజు అంకితం చేస్తూ మరోసారి సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్లారు.

# ముగిసిన పోలీస్ డ్యూటీమీట్



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంగా జరిగిన రాజన్న జోన్‌స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ మంగళవారం ఘనంగా ముగిసింది. ఇందులో ఆరు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారిని వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి డ్యూటీమీట్‌కు పంపించనున్నారు. విజేతలకు సీపీ గౌస్ ఆలం పతకాలు అందించారు. సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ విభాగంలోని ఫోరెన్సిక్ సైన్స్ రాతపరీక్షలో గంగాధర ఎస్సై వంశీకృష్ణ బంగారుపతకం సాధించారు. క్రైం ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ చట్టాలు విభాగంలో సిద్దిపేట కమిషనరేట్‌లోని రాయపోల్ ఎస్సై రఘుపతి, మెడికల్ లీగల్ టెస్ట్‌లో చొప్పదండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.ప్రదీప్ కుమార్, లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎగ్జిబిట్స్ పరీక్షలో కామారెడ్డి ఎస్సై ఆంజనేయులు, ఫింగర్ ప్రింట్ సైన్స్‌లో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన ఎస్సై యూనస్, క్రైంసీన్ ఫొటోగ్రఫీ పరీక్షలో కామారెడ్డి జిల్లాకు చెందిన ఎస్సై ఆంజనేయులు, పోలీస్ పోర్ట్రైట్ పరీక్షల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన కానిస్టేబుల్ ప్రసన్న కుమార్ బంగారు పతకం సాధించారు. యాంటీ సాబెటేజ్ చెక్‌లోని గ్రౌండ్‌సర్చ్‌లో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన కానిస్టేబుళ్లు వి.సంతోష్, వి.వెంకటేశ్, రూంసెర్చ్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన కానిస్టేబుళ్లు ఎం.శ్రవణ్ కుమార్, జి.కిరణ్‌కుమార్, వెహికల్‌సెర్చ్‌లో సిద్దిపేట కమిషనరేట్‌కు చెందిన కానిస్టేబుల్ బి.శ్రీనివాస్, ఎం.శంకర్ బంగారు పతకం సాధించారు. యాక్సెస్ కంట్రోల్‌లో మెదక్ జిల్లాకు చెందిన కానిస్టేబుళ్లు ఎం.దుర్గాప్రసాద్, కె.సిద్ధిరాములు, డాగ్‌స్క్వాడ్ కాంపిటీషన్‌లోని ట్రాకింగ్‌లో సిద్దిపేట కమిషనరేట్‌కు చెందిన కానిస్టేబుల్ జి.శంకర్, నార్కోటిక్ విభాగంలో సిద్దిపేట కమిషనరేట్‌కు చెందిన కానిస్టేబుల్ పి.అజయ్, ఎక్స్‌ప్లోజివ్‌లో సిద్దిపేట కమిషనరేట్ కు చెందిన డాగ్ హ్యాండ్లర్ పి.వెంకటేశ్ బంగారు పతకం, కంప్యూటర్ అవేర్నెస్ కాంపిటీషన్‌లో మెదక్ జిల్లాకు చెందిన కానిస్టేబుల్ ఎస్.సతీశ్‌కుమార్, ఆఫీస్ ఆటోమేషన్‌లో సిద్దిపేట కమిషనరేట్‌కు చెందిన కానిస్టేబుల్ యూ.భాస్కర్, ప్రోగ్రామింగ్ ఎబిలిటీలో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన ఫోరెన్సిక్ ల్యాబ్ కానిస్టేబుల్ జి.సంతోష్ కుమార్ బంగారు పతకం పొందారు. పోలీస్ ఫొటోగ్రఫీ విభాగంలో మెదక్ జిల్లాకు చెందిన ఎం.శ్రీధర్‌గౌడ్, వీడియోగ్రఫీలో మెదక్ జిల్లాకు చెందిన కానిస్టేబుల్ శ్రీధర్ గౌడ్‌కు బంగారు పతకాలు వచ్చాయి. అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు విజయ్ కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## డీట్ యాప్‌పై యువతకు అవగాహన కల్పించాలి

- అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

**శెనార్తి మీడియా, కరీంనర్:**

ఏఐ ఆధారిత డీట్ (డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలం గాణ) యాప్‌పై నిరుద్యోగ యువత, విద్యార్థులకు అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో డీట్ యాప్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న పరిశ్రమలు, సంస్థలు, గ్రానైట్స్, రైస్ మిల్లులు ఈ యాప్‌లో రిజిస్టర్ అయ్యే విధంగా చూడాలన్నారు. ప్రైవేట్ సంస్థల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఈ యాప్‌ను రూపొందారన్నారు. ఐటీఐ, పాలి టెక్నిక్, తదితర కళాశాలల ఫైనల్ ఇయర్ విద్యార్థులు, యువత, స్కిల్ వర్కర్లు ఈ యాప్‌లో నమోదయ్యేలా చూడాలని ఆదేశించారు. ఎంప్లాయర్లు తమకు కావాల్సిన అర్హత కలిగిన వారిని ఎంపిక చేసే అవకాశం ఉంటుందని, రాష్ట్ర వ్యాప్తంగా అనేక మందికి ఉపాధి మార్గాలు లభిస్తాయని తెలిపారు. సమావేశంలో మెప్మా పీడీ వేణు మాధవ్, ఎన్‌వైకే కో–ఆర్డినేటర్ రాం బాబు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనర ల్ మేనేజర్ సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్ఓ

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వెంకటరమణ జెడ్పి క్వార్టర్స్‌లోని వయోవృద్ధుల సంరక్షణ కేంద్రాన్ని మైనార్టీ గురుకుల పాఠశాల వైద్యాధికారి సనా జవేరియాతో కలిసి సందర్శించారు. సేవలు పొందుతున్న వయోవృద్ధులతో మాట్లాడి, ఫిజియోథెరపీ సేవలపై వారికి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఫిజియోథెరపిస్ట్ కోటేశ్వర్‌ను వివరణలకు గురిచేశారు. తర్వాత సప్తగిరి కాలనీ పరిధిలోని గోదాం గడ్డ మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న సమగ్ర ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించారు. ఇందులో హెచ్ఐవి, సిఫిలిస్, క్షయ వ్యాధి, షుగరు, అధిక రక్తపోటు, హెపటైటిస్ బి, సి, హిమోగ్లోబిన్ పరీక్షల నిర్వహణను గమనించారు. వికృతలు బయటపడినవారికి అందిస్తున్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్శనలో మైనార్టీ గురుకుల వైద్యాధికారి సనా జవేరియా, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సాఫేర్ హుస్సేన్, డిపిఓ ఎన్హెచ్ఎం స్వామి, ఫిజియోథెరపిస్ట్ కోటేశ్వర్ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



**చొప్పదండి ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలన**

చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజగోపాల్ రావుతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు.వారు అటెండెన్స్ రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్లు, ఇతర ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. ఎన్సీడీ క్లినిక్ లో అధిక రక్తపోటు, షుగర్ వ్యాధుల వివరాలు ఉన్న రికార్డులను పరిశీలించి, బాధితులకు మందుల పంపిణీ తీరును గమనించారు.గోడపై ప్రదర్శించిన చార్ట్‌లో ఉన్న మందుల స్ట్రిప్‌ల వివరాలు చూసి, ఉచితంగా ఈ మందులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. ఫార్మసీలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలు పరిశీలించారు. ఆరోగ్య మహిళా హెల్త్ క్యాంపులకు మహిళలను ప్రోత్సహించి 100 శాతం స్క్రీనింగ్ పూర్తయ్యేలా చేసి, అవసరమైతే రీస్క్రీనింగ్ నిర్వహించాలని తెలిపారు. టీవీ ఆరోగ్య కేంద్రం పనివేళల్లో ఎప్పుడూ ఆన్‌లో ఉండి, ఆరోగ్య అవగాహనపై వివరాలు ప్రసారం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ రాజగోపాల్ రావు, పీఓఎంహెచ్ఎన్ డాక్టర్ సన జ వేరియా, చొప్పదండి ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సురేందర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.